క్లుప్తంగా

నేత్రపర్వం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేషంగా అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం విశేష పూజలు చేశారు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

దసరా వచ్చిందయ్యా..

ప్రారంభమైన విజయదశమి సంబరాలు

ఆ రోజే గాంధీ జయంతి కావడంతో నేడే 'పొట్టేళ్ల వేట'



పెందుర్తి: అమ్మలగన్న అమ్మ.. దుర్గమ్మ పూజలు జోరుగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగియనుండటంతో విజయదశమి వేడుకలకు నియోజకవర్గం సిద్ధమైంది. గురువారం జరిగే దసరా పండగ కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు సొంత ఊళ్లకు చేరుకుంటున్నారు. పండగకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లతో ప్రధాన కూడళ్లు మంగళవారం సాయంత్రం సందడిగా మారాయి. మరోవైపు గురువారం దసరా కావడంతో మాంసాహార ప్రియులు బుధవారమే 'పొట్టేళ్ల బలి' కార్యక్రమం పెట్టుకున్నారు. మరోవైపు మద్యం ప్రియులతో నేడు దుకాణాలు కిటకిటలాడనున్న నేపథ్యంలో మద్యం వ్యాపారులు 'కిక్' ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

పొట్టేళ్లకు డిమాండ్

దసరా సంబరాల్లో జంతు బలి తప్పనిసరి. ఈ ఏడాది పెందుర్తి ప్రాంతానికి వేల సంఖ్యలో పొట్టేళ్లు, మేకలు వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యాయి. ఒక్కో పొట్టేలు సైజును బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ పలికింది. మేకను రూ.8 వేల నుంచి రూ.12వేల వరకూ కొనుగోలు చేశారు. నాటు కోళ్లు, బాయిలర్ కోళ్లకు కూడా మంచి గిరాకీ ఏర్పడింది. నాటు కోడి కనీసం రెండు కిలోలు తూగేది సగటున రూ.2 వేల పైనే పలికింది. గత మూడు నాలుగు రోజులుగా వారపు సంతలు నాటుకోళ్లు, పొట్టేళ్ల బేరాలతో కిటకిటలాడాయి.

జోరుగా వ్యాపారాలు

దసరా సంబరాల్లో మిఠాయిలది ప్రత్యేక స్థానం. స్నేహితులకి, బంధువులకు అందించేందుకు రకరకాల స్వీట్లు కొనుగోలు చేస్తుంటారు. పెందుర్తి ప్రాంతంలో పలు స్వీటు దుకాణాల్లో ప్రత్యేక వంటకాలు వినియోగదారులను స్వాగతించాయి. వాటితో పాటు పలు సంస్థల్లో ఉద్యోగులకు పండగ కానుకలు ఇచ్చేందుకు వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా కనిపించాయి. మరోవైపు జీఎస్టీ చార్జీల తగ్గింపుతో మోటార్ సైకిళ్లు, గృహోపకరణాల కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. ఎలక్ట్రానిక్,, మోటార్‌సైకిళ్లు, వస్త్ర, బంగారు దుకాణాల్లో దాదాపు రూ.5 నుంచి రూ.8 కోట్ల వరకు అమ్మకాలు జరిగినట్లు అంచనా.

వాహనపూజకు సిద్ధం

ఇప్పటికే కంపెనీల్లో దసరా సంబురాలు ముగిశాయి. నియోజకవర్గంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా పరిశ్రమల్లో ఆయుధ పూజ నిర్వహించి ఉద్యోగులకు సెలవులు ప్రకటించారు. ఇక దసరా నాడు వాహనాలకు పూజ చేయడం సంప్రదాయం. లారీలు, బస్సులు, ఆటోలు, మోటారుసైకిళ్లు, ఇతర మోటారు వాహనాలతో పెందుర్తి, చినముషి డివాడ, పురుషోత్తపురం, వేపగుంట తదితర ప్రాంతాలలో వాటర్ సర్వీసింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. కష్టాలన్నీ తొలగి శుభం కలగాలని ప్రార్థిస్తూ దుర్గమ్మను, తమ ప్రయాణం సురక్షితంగా సాగేలా వాహనాలకు పూజలు చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.



దసరా కోసం తరలిపోతున్న పొట్టేళ్లు



సంతలో పొట్టేళ్లను కొనుగోలు చేస్తున్న దృశ్యం

ధరలు

- అమ్మవారి పటం : రూ.50 నుంచి రూ.100
- దిష్టి సామాగ్రి : రూ.60-80
- యాపిల్ : రూ.250-300(కిలో)
- బత్తాయి : రూ.100-150(డజను)
- షోరూంలలో కొన్ని మోడళ్ల బైక్‌లకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఆఫర్లు పెట్టారు. కార్లు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు తగ్గింపుతో అమ్మకాలు జరుపుతున్నారు.



సబ్బవరం మండలం గుల్లేపల్లి సంతలో అమ్మకానికి నాటుకోళ్లు

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

పరవాడ: మండలంలో రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామంలో రూ.6 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ధర్మారాయుడుపేట గ్రామంలో కావలి బాబూరావు ఇంటి నుంచి ఊరి చివర వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేయడానికి పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి రూ.6 లక్షలను మంజూరు చేశారని ఆయన తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మాజీ ఎంపీటీసీ కావలి రాజు, మొల్లి వెంకటరావు, కావలి వాసు, మోటూరు సత్యం పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి ఉత్సవం



అమ్మవార్లకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సువర్ణ అమ్మవారు, చతుర్భుజతాయారు అమ్మవార్లకు విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందారు.అంతకుముందు ఉదయం ఆలయంలో రామాయణ పారాయణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జయహో దుర్గాభవానీ..

- దుర్గాష్టమి వేళ అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఘనంగా దేవీనవరాత్రి ఉత్సవాలు




పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో మహాదుర్గాదేవిగా అమ్మవారు



కృష్ణరాయపురంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్



దుర్గాదేవిగా ఉమాదేవి



ఎస్ఆర్ పురంలో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ



అయ్యప్ప దేవాలయంలో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ



శ్రమశక్తినగర్‌లో మహాదుర్గగా పంచముఖ గాయత్రీదేవి



గంగవరం శ్రీదేవి ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న గురుకుల విద్యార్థులు



దేవీపురంలో బాలికలకు కుమారి పూజలు నిర్వహిస్తున్న సాధకులు



పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా..



చందన అలంకరణలో అలివేలు మంగమ్మ

పెందుర్తి: మహాదుర్గగా అమ్మవారు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో అష్టమి తిథిని పురస్కరించుకుని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రిమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మహాదుర్గగా అమ్మవారు పూజలందుకున్నారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీ ఎత్తున కుంకుమ పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. చందనాన్ని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త డి.వై. చైనులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, విశేష అర్చనలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భవానీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో అమ్మవారు మహాదుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- కృష్ణరాయపురంలో కొలువుదీరిన దుర్గాదేవిని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నేతలు రాపర్తి మాధవరావు, మెంటి మహేష్, కోరాడ చందు యాదవ్, ఆకుల వాసు, రోమాల నూకరాజు, వేపాడ శ్రీను, జామి ఎర్నిబాబు, వీర్రాజు, శివ, వేపాడ రాజు, అయిత రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి మంగళవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో 12 సంవత్సరాలు పైబడిన, సుమారు 100 మంది కన్యలకు కుమారీ పూజ నిర్వహించారు. ఆనంతరం గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో కందర్ప రమ, మూర్తి రాధ వంటి సాధకులు అమృత కన్యా గురుకులం పిల్లలకు షోడశోపచార పూజలు చేశారు. యాగశాలలో శ్రీగణపతి వారాహి సహిత చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి తిరుపతిలోని ఋషి పీఠం నిర్వాహకురాలు గంగవరం శ్రీదేవి శివ శక్త్యైక్య రూపం అనే అంశంపై ప్రవచించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు.

నేడు సువాసినీ పూజలు

బుధవారం పెళ్లి అయిన స్త్రీలకు ఉచిత సువాసినీ పూజలు, సరస్వతీ సహస్ర నామావళి హోమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఉమాదేవి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌ను దుర్గాదేవిగా అలంకరించి, మహిళలు కుంకుమపూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించనివ్వం



పోర్టు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు ఆస్పత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరుతామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు 365 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరూ ముందుకు రాలేదని, పోర్టు యాజమాన్యం వద్ద ఉన్న సొంత నిధులతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగర అభివృద్ధికి పోర్టు ఎంతో కీలకమన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఐద్వా నాయకురాలు సుమిత్ర, రైతు సంఘం నాయకుడు నాయన బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ,జె.సత్యనారాయణ, గణేష్, శంకర్రావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

పెదగంట్యాడ: మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటామన్నారు. మార్టుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, రోజారాణి, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, కటికల కల్పన, సంపంగి ఈశ్వరరావు, కాకినాడ పెంటారావు, వెంకటేష్, డాక్టర్ ఎస్ రాజారావు, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాదయాత్ర

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు గంగవరం పోర్టు కాలుష్యంతో పాటు డంపింగ్ యార్డ్ నుంచే వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.